క్లుప్తంగా


విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు



మాట్లాడుతున్న డీఈ విద్యాసాగర్

పెద్దఅడిశర్లపల్లి : నిరంతర విద్యుత్ అందించడంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని దేవరకొండ డివిజనల్ ఇంజనీర్ విద్యాసాగర్ సిబ్బందిని హెచ్చరించారు. మంగళవారం మండలంలోని అంగడిపేట ఎక్స్‌రోడ్ వద్ద గల విద్యుత్ కార్యాలయంలో సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మండలంలో ట్రాన్స్‌ఫార్మర్లు చోరీ జరుగుతున్న నేపథ్యంలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ సైదులు, ఏఈ కావ్య, సిబ్బంది తదితరులున్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో కాన్పుల సంఖ్య పెంచాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ శ్రీనివాస్

మిర్యాలగూడ టౌన్ : ప్రభుత్వ ఆస్పత్రుల్లో కాన్పుల సంఖ్యను పెంచాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి పుట్ల శ్రీనివాస్ అన్నారు. మంగళవారం స్థానిక రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ భవనంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జాతీయ ఆరోగ్యశాఖ నిర్వహించే కార్యక్రమాలను వంద శాతం విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్ఓలు కేసా రవి, గీతావాణి, డాక్టర్లు కళ్యాణ్‌చక్రవర్తి, కృష్ణకుమారి పాల్గొన్నారు.

26న శివపార్వతుల కల్యాణం

దేవరకొండ : మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని దేవరకొండ పట్టణంలోని శ్రీ భక్త మార్కండేయ దేవస్థానంలో ఈ నెల 26న శివపార్వతుల కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు వనం జగదీశ్వర్ తెలిపారు. మంగళవారం స్థానిక దేవాలయ ప్రాంగణంలో కల్యాణ మహోత్సవానికి సంబంధించిన కరపత్రాలను ఆయన విడుదల చేసి మాట్లాడారు. కార్యక్రమంలో మణిదీప్, ఎల్లయ్య, చంద్రమౌళి, తదితరులున్నారు.

మొక్కలు ఎండిపోకుండా చూడాలి



అధికారులతో మాట్లాడుతున్న డీఆర్‌డీఓ

మిర్యాలగూడ : నర్సరీల్లో మొక్కలు ఎండిపోకుండా సిబ్బంది ఎప్పటికప్పుడు నీటిని పోసి సంరక్షించాలని డీఆర్‌డీఓ వై.శేఖర్‌రెడ్డి సూచించారు. మంగళవారం దామరచర్ల మండలంలోని బెట్టెతండా, పాచ్చునాయక్‌తండా, దామరచర్ల, వీర్లపాలెం గ్రామాల్లోని నర్సరీలను ఆయన పరిశీలించారు. నర్సరీల్లో నాటిన మొక్కలు ఎండిపోతే సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట ఎంపీడీఓ మూర్తి, అధికారులు, సిబ్బంది ఉన్నారు.

విధుల్లో చేరిన కాంట్రాక్ట్ ఉపాధ్యాయులు

పెద్దవూర : 2008 డీఎస్సీలో నష్టపోయిన బీఈడీ అభ్యర్థులకు కాంట్రాక్టు పద్ధతిన ఉద్యోగాలు ఇచ్చేందుకు విద్యాశాఖ ఆదేశాలు ఇచ్చింది. దీంతో మండలంలో ఐదుగురు కాంట్రాక్టు ఉపాధ్యాయులు మంగళవారం విధుల్లో చేరారు. ఈ నెల 15న జిల్లా కేంద్రంలోని డీఈఓ కార్యాలయంలో కౌన్సిలింగ్ నిర్వహించి డీఈఓ భిక్షపతి పోస్టింగ్ ఆర్డర్‌లు ఇచ్చారు. వారి నుంచి ఎంఈఓ తరి రాములు బాండ్ పేపర్‌పై సాక్షుల సంతకాలు తీసుకుని నియామక పత్రాలు అందించారు. అనంతరం వారు విధుల్లో చేరారు. మండలానికి మొత్తం ఆరుగురికి పోస్టింగ్ ఆర్డర్‌లు ఇవ్వగా వారిలో బాసోనిబావితండాకు వచ్చిన వ్యక్తి రాలేదు. మిగిలిన ఐదుగురు చేరారు. వారికి నెలసరి వేతనం రూ.31,040 ఇవ్వనున్నారు.

స్టడీ మెటీరియల్ అందజేత



స్టడీ మెటీరియల్‌ను అందిస్తున్న ఫౌండేషన్ చైర్మన్ పాండురంగారావు

గుర్రంపోడు : బాలికలు అన్ని రంగాల్లో రాణించాలంటే చదువు ముఖ్యమని పీఆర్‌ఆర్ ఫౌండేషన్ చైర్మన్ చెల్లం పాండురంగారావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలలో పదోతరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ చైర్మన్ పాండురంగారావు మాట్లాడారు. బాలికలు స్టడీ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకుని మంచి ఫలితాలు సాధించాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఓ విజయశ్రీ, పాఠశాల సిబ్బంది, టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదమని తెలిసినా.. పట్టించుకోరా

- ప్రమాదకరంగా అల్వాల వంతెన
- రెండు వైపులా విరిగిన రెయిలింగ్‌తో భయాందోళనలో ప్రయాణికులు



ప్రమాదకరంగా ఉన్న అల్వాల వంతెన

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : మండలంలోని అల్వాల గ్రామశివారులో గల నాగార్జునసాగర్ ఎడమకాలువ పై ఉన్న వంతెన ప్రమాదకరంగా మారింది. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రయాణికులు, స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. ఈ వంతెన మీదుగా ఆయా గ్రామాలకు చెందిన వాహనదారులు అధిక సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటాయి. వంతెన ఇరుకుగా ఉండడంతో పాటు, వంతెనకు రెండు వైపులా ఏర్పాటు చేసిన ఇనుప కడ్డీలు సైతం వంగిపోయి, విరిగిపోవడంతో వాహనదారులు ఎప్పుడు ఏప్రమాదం చోటు చేసుకుంటుందోనని భయాందోళన నడుమ రాకపోకలు సాగిస్తున్నారు. వంతెనపై వాహనాలు ఎదురుపడే సమయంలో సమస్య తీవ్రతరం కానుంది. మల్లెపల్లి, పెద్దవూరతో పాటు ఆయా గ్రామాలకు వెళ్లాలంటే ఈ వంతెన మీదుగానే ప్రయాణం సాగించాల్సి ఉంటుంది. కాలువకు రెండు వైపులా ఎలాంటి రక్షణ గోడలు ఏర్పాటు చేయకపోవడంతో అల్వాల నుంచి వచ్చే వాహనాలు నేరుగా కాలువలో పడిపోయే ప్రమాదం ఉందని, గతంలో వాహనాలు పడిపోయిన సంఘటనలు కూడా ఉన్నాయని పలువురు స్థానికులు వెల్లడించారు. దీంతో ప్రయాణికులు భయాందోళనకు గురవుతున్నారు. అదే విధంగా వంతెన వద్ద ప్రమాదకరంగా మూలమలుపు ఉండడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మూలమలుపుల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు వంతెనకు రెండు వైపులా రక్షణ వలయాలు అమర్చాలని ప్రయాణికులు కోరుతున్నారు.



కాలువ కట్ట వద్ద ప్రమాదకరంగా ఉన్న మూలమలుపు



వంతెన వద్ద ఉన్న మూలమలుపు

ప్రతిఒక్కరూ భక్తిభావం కలిగి ఉండాలి



ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ కోటిరెడ్డి

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : ప్రతిఒక్కరూ ఆధ్యాత్మికతో కూడిన భక్తిభావాన్ని కలిగి ఉండాలని ఎమ్మెల్సీ కోటిరెడ్డి అన్నారు. మండలంలోని ఎర్రచెరువు తండాలో మంగళవారం నిర్వహించిన ముత్యాలమ్మజాతరలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడారు. దైవచింతనతోనే మానసిక ప్రశాంతత పొందవచ్చన్నారు. అనంతరం ఆయనను ఆలయ కమిటీ నిర్వాహకులు శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ తారాసింగ్, మాజీ ఉపసర్పంచ్ రమేష్, నాయకులు బిచ్చునాయక్, కేఎస్ఎన్ రాజు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు మైక్‌సెట్, ఎలక్ట్రిక్ బెల్ బహూకరణ



మైక్‌సెట్, ఎలక్ట్రానిక్ బెల్‌లను అందిస్తున్న పూర్వ విద్యార్థులు

పెద్దవూర : మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలకు అదే పాఠశాలలో 1992–93సం వత్సరంలో పదోతరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు రూ.25వేల విలువైన మైక్‌సెట్, ఎలక్ట్రిక్ బెల్‌ను మంగళవారం ఎంఈఓ, పాఠశాల హెచ్‌ఎం తరి రాములుకు అందజేశారు. ఎలక్ట్రిక్ బెల్‌ను మండలంలోని సంగారం గ్రామానికి చెందిన పూర్వ విద్యార్థి అలుగుబెల్లి ఉపేందర్‌రెడ్డి సొంత ఖర్చులతో బహూకరించారు. పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రతి సంవత్సరం రూ.10వేలు ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు అనుముల కిషన్, భీమ్లా నాయక్, నడ్డి ఆంజనేయులు, శ్రీనివాస్‌రెడ్డి, పాపిరెడ్డి పాల్గొన్నారు.

ఎస్ఐ పేరిట ఫోన్ చేసిన వ్యక్తుల అరెస్ట్

దేవరకొండ : లోకల్ ఎస్ఐని మాట్లాడుతున్నా.. నాకు రూ.5వేలు ఫోన్ పే చేయాలని ఓ మీసేవా నిర్వాహకుడికి ఫోన్ చేసి మోసం చేసిన ఇద్దరు వ్యక్తులను మంగళవారం పట్టణ పోలీసులు అరెస్ట్ చేశారు. దేవరకొండ సీఐ నర్సింహులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం రెంటచింతలకు చెందిన రాజేందర్, సాగర్ తిరుమలగిరికి చెందిన అఖిల్ దేవరకొండ పట్టణానికి చెందిన మీ సేవా నిర్వాహకుడు జగపతిబాబుకు ఆదివారం ఫోన్ చేశారు. నేను లోకల్ ఎస్ఐని మాట్లాడుతున్నా నాకు అత్యవసరంగా ఫోన్ పేలో రూ.5వేలు పంపాలని కోరారు. ఇది నమ్మిన జగపతిబాబు నగదును ట్రాన్స్‌ఫర్ చేశాడు. తిరిగి సాయంత్రం ఆ నంబర్‌కు ఫోన్ చేయగా స్విచ్చాఫ్ అని వచ్చింది. దీంతో మోసపోయానని గ్రహించిన జగపతిబాబు సోమవారం దేవరకొండ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఫోన్ నంబర్ ఆధారంగా విచారణ చేపట్టి మంగళవారం సదరు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు సీఐ తెలిపారు.

సీపీఐ బలోపేతానికి కృషి చేయాలి

- మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరిరావు



మాట్లాడుతున్న ఉజ్జిని యాదగిరిరావు

చింతపల్లి : గ్రామస్థాయిలో సీపీఐ బలోపేతానికి కార్యకర్తలకు కృషి చేయాలని మునుగోడు మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరిరావు పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మండల కౌన్సిల్ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గ్రామాలలో పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కంకణబద్ధులై పనిచేయాలన్నారు. ఈ నెల 20 నుంచి గ్రామ కమిటీల ఎన్నిక, మార్చి నెలలో మండల మహాసభ నిర్వహించనున్నట్లు తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాలలో గ్రామ శాఖ సమావేశాలు నిర్వహించి నూతన కార్యదర్శులను ఎన్నుకోనున్నట్లు వెల్లడించారు. రానున్న స్థానిక ఎన్నికల్లో మండలంలోని ఎంపీటీసీ, సర్పంచ్ స్థానాలకు పార్టీ నాయకులు పోటీకి సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పార్టీ జిల్లా నాయకుడు ఉజ్జిని యుగంధర్‌రావు, మండల కార్యదర్శి పోలే వెంకటయ్య, ఉజ్జిని అంజల్‌రావు, కొలుకులపల్లి కొండల్, వెంకటయ్య, శేఖర్, యాదయ్య, బుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

సర్వోత్తమ్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలి



చింతపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

చింతపల్లి : వరంగల్, ఖమ్మం, నల్లగొండ నియోజకవర్గ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా తెలంగాణ ప్రాంతీయ ఉపాధ్యాయుల సంఘం మద్దతుతో పోటీ చేస్తున్న బీజేపీ అభ్యర్థి పులి సర్వోత్తమ్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని బీజేపీ మండల అధ్యక్షుడు సముద్రాల నగేష్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని అధ్యాపక, ఉపాధ్యాయులను కలిసి ఆ పార్టీ నాయకులు ఓటు అభ్యర్థించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి చేనమోని రాములు, ఎమ్మెల్సీ ఎన్నికల మండల ఇన్‌చార్జ్ శివర్ల రమేష్ యాదవ్, సహా ఇన్‌చార్జ్ వెన్నం శేఖర్, పార్టీ జిల్లా, మండల నాయకులు కుకుడపు రామకృష్ణ, కనిగిరి గోవర్ధన్, ధరణిపతి రమణరావు, బొడ్డు మహేశ్, శ్రీనివాస్, శ్రీను, లక్ష్మణ్, మహేందర్ పాల్గొన్నారు.

దేవరకొండ : నల్లగొండ, వరంగల్, ఖమ్మం నియోజకవర్గ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి పులి సర్వోత్తమ్‌రెడ్డిని గెలిపించాలని ఆ పార్టీ ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంకూరి నర్సింహ కోరారు. మంగళవారం దేవరకొండ మండల పరిధిలోని ప్రభుత్వ ఉపాధ్యాయులను కలిసి వారు ప్రచారం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడారు. సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ చేస్తానన్న సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. వివిధ డిపార్ట్‌మెంట్లలో ఉన్న 317 జీఓ బాధిత ఉద్యోగులకు ఇంత వరకు న్యాయం జరగలేదన్నారు. ఆయన వెంట నాయకులు గుండాల అంజయ్య, ఛండీశ్వర్, రామునాయక్, జైరాంనాయక్, తదితరులు ఉన్నారు.

బహుజన కులాల ఐక్యతను చాటాలి



సమావేశంలో పాల్గొన్న నాయకులు

కొండమల్లేపల్లి : నల్లగొండ, ఖమ్మం, వరంగల్, ఉమ్మడి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పూల రవీందర్‌ను గెలిపించి బహుజన కులాల ఐక్యతను చాటాలని మునుగోడు నియోజకవర్గ స్థాయి మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అపెక్స్ కౌన్సిల్ కన్వీనర్ పుట్టం పురుషోత్తం కోరారు. మంగళవారం కొండమల్లేపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన మునుగోడు నియోజకవర్గ స్థాయి మున్నూరు కాపు సంఘం సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బీసీ ఉద్యమానికి దిక్సూచిగా నిలిపేందుకు పూల రవీందర్‌ను గెలిపించాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం బీసీ ఉద్యమకారుడు, అఖిల భారత హిందూ బీసీ మహాసభ అధ్యక్షుడు బత్తుల సిద్దేశ్వర్ మాట్లాడారు. సమావేశంలో బీసీ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు పర్వతం సతీష్, దేవరకొండ నియోజకవర్గ కోఆర్డినేటర్ కోట్ల జగదీశ్వర్, నిడమనూరు మండల అధ్యక్షుడు లోకసాని నరేందర్, వంగ పెద్దన్న తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వేణుగోపాలస్వామి కల్యాణం



స్వామి అమ్మవార్లకు తలంబ్రాలు పోస్తున్న పూజారులు

త్రిపురారం : మండలంలోని బాబుసాయిపేట గ్రామపంచాయతీ పరిధిలో కొలువై ఉన్న శ్రీరుక్మిణి సత్యభామ సమేత శ్రీ మువ్వా వేణుగోపాలస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం తెల్లవారుజామున స్వామి అమ్మవార్ల కల్యాణాన్ని గ్రామస్తులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కల్యాణం ఆలయ అర్చకులు కనగాల రాజశేఖరశర్మ ఆధ్వర్యంలో యాజ్ఞికులు కారంపుడి వంశీకృష్ణామాచార్యుల వేద మంత్రోచ్చరణల నడుమ నిర్వహించారు. అంతకు ముందు ఆలయంలో విశ్వక్సేన పూజ, భగవత్ పుణ్యాహవచనం, రక్షాబంధనం, మత్సం గ్రహణము, అంకురార్పణ, అగ్నిముఖం, ధ్వజారోహణము(గరుడముద్ద) భేరిపూజ, దేవాతాహ్వానం కార్యక్రమాలు చేపట్టారు. ఈ వేడుకకు వివిధ ప్రాంతాలతో పాటుగా చుట్టపక్కల గ్రామాల భక్తులు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుమారు 4000మంది భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం స్వామి వారిని అమ్మవారిని వీధుల్లో ఊరేగింపు చేపట్టారు. అదే విధంగా యూత్ కమిటీ ఆధ్వర్యంలో ఆలయంలో నిర్వహించిన కబడ్డీ పోటీలు ఆకట్టుకున్నాయి. కల్యాణంలో ఆలయ చైర్మన్ గోపగాని శ్రవణ్‌కుమార్, ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ట్రంప్‌తో మోదీ స్నేహం సిగ్గుచేటు



మాట్లాడుతున్న తుమ్మల వీరారెడ్డి

హాలియా : అమెరికాలో బతకడానికి ఏజెంట్లు, దళారుల ద్వారా వెళ్లి మోసపోయిన భారతీయులను యుద్ధ ఖైదీల మాదిరిగా కాళ్లకు, చేతులకు సంకెళ్లు వేసి తీసుకొచ్చి వదలివేస్తుంటే ప్రధాని మోదీ తమాషాగా ట్రంప్‌తో స్నేహం చేయడం సిగ్గుచేటని సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి తప్పుపట్టారు. మంగళవారం హాలియా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉక్రెయిన్‌లో యుద్ధం ఆపి భారతీయులను తీసుకొచ్చామని గొప్పలు చెప్పుకుంటున్న ప్రధాని మోదీ అమెరికా దేశ అధ్యక్షుడు ట్రంప్‌తో మాట్లాడేందుకు ఎందుకు చొరవ తీసుకోలేదని నిలదీశారు. ఇక బీజేపీ నాయకులు, మంత్రులు ఎంపీలు ట్రంపు చర్యలను సమర్థించడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి అవుతా సైదులు, రేబెల్లి వెంకటేశ్వర్లు, వెంకన్న, ఆవుల రాంరెడ్డి తదితరులు ఉన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కొండమల్లేపల్లి : అనుమతులు లేకుండా అక్రమంగా తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను మండల పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను మండలంలోని చెన్నారం గ్రామం వద్ద పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. మండలంలో ఎవరైనా అక్రమంగా ఇసుక తరలిస్తే చట్టరీత్యా చర్యలు ఉంటాయని ఆయన హెచ్చరించారు.

గ్రామీణ వైద్యులకు చట్టబద్ధత కల్పించాలి



వేములపల్లి(మాడ్గులపల్లి) : పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఆర్ఎంపీలు

వేములపల్లి(మాడ్గులపల్లి) : ప్రభుత్వం గ్రామీణ వైద్యులకు చట్టబద్ధత కల్పించాలని ఆర్ఎంపీల సంఘం మాడ్గులపల్లి మండల అధ్యక్షుడు నూకపంగు శ్రీనివాస్, జిల్లా నాయకుడు నిమ్మల వెంకన్న అన్నారు. సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం ఆర్ఎంపీలు 'హలో ఆర్ఎంపీ చలో హైదరాబాద్'లో భాగంగా హైదరాబాద్‌కు తరలివెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఆర్ఎంపీలకు చట్టబద్ధత కల్పించడంతో పాటు ఆర్ఎంపీలపై జరుగుతున్న దాడులను అరికట్టాలన్నారు. వెళ్లిన వారిలో జిల్లా కన్వీనర్ షేక్ రసూల్, పొదిల నాగరాజు, ఒగ్గు నర్సయ్య, భాస్కరచారి, లక్ష్మణ్, రమణ, ఆసిఫ్, లక్ష్మీనారాయణ, వెంకటాచారి, అక్బర్, మహేష్, గుర్రం నరేష్ పాల్గొన్నారు.

గ్రామీణ వైద్యుల ముందస్తు అరెస్ట్

మిర్యాలగూడ టౌన్ : సమస్యలు పరిష్కరించాలని కోరుతూ హైదరాబాద్‌లో జరిగే సభకు వెళ్తున్న గ్రామీణ వైద్యులను మంగళవారం స్థానిక టూటౌన్ పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. అనంతరం వారిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా తెలంగాణ గ్రామీణ వైద్యుల సంఘం జిల్లా అధ్యక్షుడు దోరేపల్లి మల్లూర్, జిల్లా కోశాధికారి పగిడిమర్రి గోవర్ధనాచారి మాట్లాడారు. శిక్షణ పొందిన 13వేల మంది కమ్యూనిటీ పారామెడికల్‌కు వెంటనే సర్టిఫికెట్లు జారీ చేయాలని, మిగిలిన వారికి ఆరు నెలల శిక్షణ అనంతరం సర్టిఫికెట్లు మంజూరు చేయాలన్నారు. ఆర్ఎంపీ, పీఎంపీలపై టీజీఎంసీ పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని, దాడులను నియంత్రించాలని డిమాండ్ చేశారు. అరెస్ట్ అయిన వారిలో నాయకులు శ్రీనివాస్, రామ్, ఎస్‌కె.అప్జల్, వెంకటేశ్వర్లు తదితరులున్నారు.

ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత

- ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి



తిరుమలగిరి : ముత్యాలమ్మ ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి




త్రిపురారం : తుల్జాభవాని, మారెమ్మతల్లి ఆలయం వద్ద ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డిని సన్మానించిన గిరిజన నాయకులు

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని, ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలని ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని ఎర్రచెరువుతండా, నాయకునితండాలో నిర్వహించిన ముత్యాలమ్మ తల్లి జాతరతో ఆయన పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జైవీర్‌రెడ్డి మాట్లాడారు. దైనందిన జీవితంలో ప్రజలు ఒత్తిడికి గురికాకుండా ధర్మకార్యాల్లో పాల్గొనాలన్నారు. ప్రతిఒక్కరూ భక్తి భావాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. పండుగలు మన సంప్రదాయాలు, సంస్కృతిని ప్రతిబింబిస్తాయని తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ వైస్‌చైర్మన్ కర్నాటి లింగారెడ్డి, హాలియా వ్యవసాయ మార్కెట్ చైర్మన్ తుమ్మలపల్లి శేఖర్ రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు కృష్ణానాయక్, నాయకులు గడ్డం సాగర్‌రెడ్డి, మేరావత్ మునినాయక్, రమావత్ లాలునాయక్, భద్రీ నాయక్, శౌరీ, కొండలు, భిక్షాలు పాల్గొన్నారు.

ఆలయంలో ఎమ్మెల్యే పూజలు

త్రిపురారం : మండలంలోని సత్యంపాడుతండాలో తుల్జాభవాని, మారెమ్మతల్లి నూతన విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవాన్ని గిరిజనులు ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి పాల్గొని మంగళవారం ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పూజల్లో వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు గిరిజనులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

యూరియా అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు



ఫర్టిలైజర్ దుకాణంలో రికార్డులను పరిశీలిస్తున్న ఏఓ సందీప్

పెద్దవూర : యూరియాను ఫర్టిలైజర్ దుకాణదారులు రైతులకు అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయశాఖ అధికారి సందీప్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పలు ఫర్టిలైజర్ దుకాణాలను ఆయన ఆకస్మికంగా తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా దుకాణాల్లోని స్టాక్ రిజిస్టర్‌లు, ఈ–పాస్ యంత్రాల పనితీరు, స్టాక్ నిల్వలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ప్రతి ఎరువుల దుకాణదారుడు ఈ–పాస్ యంత్రాన్ని తప్పనిసరిగా వినియోగించాలన్నారు. ఆధార్ కార్డు తీసుకువచ్చిన రైతులకే ఈ–పాస్ యంత్రాల ద్వారా కాంప్లెక్స్ ఎరువులను విక్రయించాలని, ఈ పాస్ యంత్రంలో నమోదైన స్టాక్ వివరాలు, దుకాణంలో నిల్వ ఉన్న సరుకుకు సరిపోవాలని సూచించారు. కల్తీ విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కొనుగోలు చేసిన ప్రతి రైతుకు బిల్లు ఇవ్వాలని, స్టాక్ వివరాలను, విత్తనాల రేట్లను నోటీసు బోర్డుపై రాసి ఉంచాలన్నారు. దుకాణాలలో కాలం చెల్లిన క్రిమిసంహారక మందులు, కాంప్లెక్స్ ఎరువులు ఏమైనా ఉన్నాయా అని పరిశీలించారు. ఆయన వెంట కర్నాటి మునిరెడ్డి, లక్ష్మణ్, కర్నాటి లక్ష్మారెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, సైదులు, రామాంజి, నర్సిరెడ్డి తదితరులు ఉన్నారు.

విద్యార్థులు లక్ష్య సాధనకు కృషి చేయాలి



స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న దేవేందర్‌రెడ్డి

దేవరకొండ : విద్యార్థులు తాము ఎంచుకున్న లక్ష్య సాధనకు నిరంతరం కృషిచేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం దేవరకొండ మండలంలోని పద్మట్‌పల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదోతరగతి విద్యార్థులకు పీఆర్‌ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలు, గురుకుల పాఠశాలలు, ఆదర్శ పాఠశాలల్లో పదోతరగతి చదువుతున్న విద్యార్థులకు ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి నిపుణులతో ప్రత్యేకంగా స్టడీ మెటీరియల్ రూపొందించి అందించడం అభినందనీయమన్నారు. అనంతరం ఫౌండేషన్ చైర్మన్ చలం పాండురంగారావు మాట్లాడుతూ.. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం చీన్యానాయక్, ఆంజనేయులు, యాదయ్య, కైలాసం ఉన్నారు.

తీన్మార్ మల్లన్నకు ఎమ్మెల్సీ పదవి జానారెడ్డి పెట్టిన భిక్ష

నాగార్జునసాగర్ : తీన్మార్ మల్లన్నకు ఎమ్మెల్సీ పదవి కుందూరు జానారెడ్డి పెట్టిన భిక్ష అని, జానారెడ్డిని బీసీలకు అన్యాయం చేశాడని అనడం నీఅవివేకమని, దమ్ముంటే మల్లన్న తన పదవికి రాజీనామా చేసి తిరిగి ఎన్నికల్లో గెలిస్తే అప్పుడు ఆయనకు రెడ్లు ఓటు వేయనట్టేనని ఓబీసీ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు ఉంగరాల శ్రీను అన్నారు. మంగళవారం నాగార్జునసాగర్ హిల్‌కాలనీలోని ఆఫీసర్స్ క్లబ్ ఆవరణలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తీన్మార్ మల్లన్న రెడ్లు, బీసీల మధ్య చిచ్చుపెట్టి పబ్బం గడుపుకుంటున్నాడని, రాష్ట్రంలోని రెడ్డి ఎమ్మెల్యేలంతా బీసీల అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారని అన్నారు. మంత్రులు కోమటిరెడ్డి, ఉత్తమ్‌కుమార్ రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి, ఎంపీ రఘువీర్‌రెడ్డి కులాల మధ్య ఎలాంటి తారతమ్యం చూపకుండా సాగునీటి కోసం ఎత్తిపోతల పథకాలు, రహదారులు తదితర అభివృద్ధి పథకాలు ప్రజలందరికీ అందేలా కృషిచేస్తున్నారని తెలిపారు. సమావేశంలో నాగరాజు, జంగయ్య, మాజీ కౌన్సిలర్లు మందా రఘువీర్ (బిన్ని), రామకృష్ణ, బీసీ నాయకులు పాల్గొన్నారు.

నగదు, బియ్యం అందజేత



నగదు, బియ్యం అందజేస్తున్న స్నేహితులు

కొండమల్లేపల్లి : మండలంలోని పెండ్లిపాకల గ్రామానికి చెందిన కోనేరు ఆంజనేయులు అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. ఆంజనేయులుతో పాటు పదోతరగతి చదువుకున్న స్నేహితులు మంగళవారం రూ.46వేల నగదు, 50 కేజీల బియ్యాన్ని మృతుడి కుటుంబానికి అందజేశారు. వారిలో సునమోని యాదయ్య, అనిమల్ల సురేష్, అందుగుల ఏడుకొండలు, శేఖర్, లచ్చిరాం, కొండల్, మల్లేష్, రాజు, శ్రీరాములు తదితరులున్నారు.

నిరుపేదలకు బియ్యం పంపిణీ

మిర్యాలగూడ టౌన్ : పట్టణంలో పరిధిలోని దుబ్బతండాలో నిరుపేద దివ్యాంగులు, వృద్ధులు, వితంతువులకు మంగళవారం ఫెయిత్ బంజారా అనాథ ఆశ్రమం నిర్వాహకులు ధీరావత్ హన్యా నాయక్, ధీరావత్ రమాబాయి 85మంది నిరుపేదలకు బియ్యం, నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో పఠాన్, జానీ, శ్యాంసన్, రామయ్య, జాన్స్, తిరుపతమ్మ, ఝాన్సీ తదితరులున్నారు.

బ్రహ్మోత్సవాలు ప్రారంభం

పెద్దఅడిశర్లపల్లి : గుడిపల్లి మండలంలోని కోదండాపురంలో శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల మంగళవారం ప్రాంభమయ్యాయి. ఈ సందర్భంగా స్వామివారికి గరుడసేవ, పరమపదోత్సవం నిర్వహించారు. బుధవారం తెల్లవారుజామున కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి తెలిపారు. కల్యాణంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.